క్లుప్తంగా

శాస్త్రోక్తంగా కాశీవిశ్వేశ్వర లింగ ప్రతిష్ట



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

పొందూరు: మండల కేంద్రంలోని బాపిరాజుపేట సమీపంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మూడు మర్రిచెట్లు వద్ద త్రినాథ త్రివటి ధర్మక్షేత్రంలో శనివారం దండి గణపతి సమేత కాశీవిశ్వేశ్వర లింగ ప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. త్రినాథ స్వాముల ప్రతిరూపాలుగా భావించే మూడు మర్రిచెట్ల ప్రాంతాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. పొందూరుకు చెందిన కిల్లి రాజమోహన్, కె.లఖిల్‌బాబా ఆర్థిక సహకారంతో ఈ నిర్మాణం చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

20 మేలు జాతి దూడల ప్రదర్శన



ప్రదర్శనలో ఉంచిన దూడలను పరిశీలిస్తున్న గ్రామపెద్దలు, వైద్యులు

ఆమదాలవలస: నేటి దూడలే రేపటి పాడి సంపద అని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎస్.మన్మథరావు అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి గేదెలవానిపేటలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖల ఆధ్వర్యంలో శనివారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. 20 మేలు జాతి దూడలు ప్రదర్శనలో పాల్గొనగా.. ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. పది మంది పశుపోషకులకు కన్సోలేషన్ బహుమతులు పంపిణీ చేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీ ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో దూడలకు ఏలికపాముల నివారణ మందులను, లివర్ టానిక్‌లను అందజేశారు. గ్రామ పెద్దలు సాధు కామేశ్వరరావు, సాధు సుందరరావు, వైద్యులు వై.హేమలత, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.23 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు



మాట్లాడుతున్న ఏఈ ఉదయ్‌భాస్కర్

నరసన్నపేట: మండలం చిక్కాలవలసలో రూ.23 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు వేశామని వీటిని శనివారం నుంచి వినియోగంలోకి తీసుకువచ్చామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. గ్రామంలో 180 ట్యాపులు వేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరో 50 శాతం నిధులు ఈ కార్యక్రమానికి వెచ్చిస్తున్నాయని, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కృషితో చిక్కాలవలసకు ఇంటింటికీ కుళాయిలు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా హర్‌ఘర్ జల్ గ్రామంగా ప్రకటించారు. నీటిని వృథా చేయవద్దని జిల్లా ఐఎస్‌ఏ కో ఆర్డినేటర్ దాలినాయుడు ప్రజలకు కోరారు. సర్పంచ్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

320 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎస్‌ఐ కృష్ణప్రసాద్

ఆమదాలవలస రూరల్: సరుబుజ్జిలి మండలంలోని లొద్దల కాగితాపల్లి గ్రామంలో రేపటి ప్రయోజనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్‌ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేవా సంస్థలు చేస్తున్న కృషిని అభినందించారు. గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి వారికి సేవలు చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైద్య శిబిరం బీపీ, సుగర్, గుండె సమస్యలు, నేత్ర పరీక్షలు, స్త్రీల సమస్యలపై 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు బాణ్న భార్గవ్, జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక మార్కులు సాధిస్తే నగదు ప్రోత్సాహం

ఆమదాలవలస రూరల్: పదో తరగతి విద్యార్థుల్లో పోటీతత్వం పెంచి అధిక మార్కులు సాధించడానికే ప్రోత్సాహక నగదును అందజేస్తున్నామని రావివలస ఆస్కార్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బొంగు సత్యనారాయణ తెలిపారు. సరుబుజ్జిలి మండలంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సమక్షంలో వివరించారు. మండలంలో 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిధిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థికి రూ.10 వేలు బహుమతిగా ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

సొంతింటి కలకు.. డ్వాక్రా సాయం

- జగనన్న గృహ లబ్ధిదారులకు అదనపు ప్రయోజనం
- స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.35 వేల రుణం
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు సున్నా వడ్డీ కింద రుణం



కట్యాచార్యులపేటలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ఆమదాలవలస రూరల్: నవరత్నాలు– పేదలందరికీ జగనన్న ఇళ్ల పథకంలో భాగంగా పేదల సొంతింటి కల నెరవేర్చడానికి ప్రభుత్వం శరవేగంగా చర్యలు చేపడుతోంది. లేఅవుట్లలో ఇప్పటికే రోడ్లు, విద్యుత్, అంతర్గత డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయలు కల్పించింది. ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తిచేయాలని అధికారులకు లక్ష్యాలను సైతం నిర్దేశించింది. ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోకపోతే.. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు డీఆర్‌డీఏ కింద రూ.35 వేల రుణం పావల వడ్డీకే ఇస్తోంది. ఈ మొత్తం కూడా సరిపడకపోతే ఉన్నత పథకం వర్తించే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు సున్నా వడ్డీ కింద రుణం అందజేస్తోంది.

8074 మందికి రుణాలు మంజూరు

ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో 14 మండలాల్లో 17,935 మందికి ప్రభుత్వం పక్కా గృహాలు మంజూరు చేసింది. తొలుత ప్రభుత్వం అందించిన రూ.1.80 లక్షలు సరిపోకపోవడంతో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు 8,074 మంది రూ. 35 వేలు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ డీఆర్‌డీఏ ద్వారా రూ. 28.26 కోట్లు మంజూరు చేశారు. లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రుణాలు పొందిన వివరాలు..

మండలం	మంజూరైన గృహాలు	రుణాలు పొందిన వారు
ఆమదాలవలస (టౌన్)	3312	546
ఆమదాలవలస (రూరల్)	1409	982
సరుబుజ్జిలి	1308	605
పొందూరు	1855	1028
బూర్జ	1778	894
నరసన్నపేట	2565	1400
పోలాకి	2226	1364
జలుమూరు	1760	1255
సారవకోట	89	0
పాతపట్నం	306	0
మెళియాపుట్టి	641	0
కొత్తూరు	349	0
హిరమండలం	238	0
ఎల్ఎన్‌పేట	99	0

రూ.35 వేల రుణం తీసుకున్నాను..



నాకు ఇంటి స్థలం పట్టా ఇచ్చారు. ఆ స్థలంలో ఇళ్లు కట్టుకుంటున్నాను. ప్రస్తుతం శ్లాబ్ నిర్మాణం పూర్తి చేసి, త్వరలోనే గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నాం. ఫ్లోరింగ్ కోసం డబ్బులు చాలకపోవడంతో బ్యాంక్ నుంచి సులభ వాయిదాలపై చెల్లించుకునే విధంగా రూ. 35 వేలు రుణం ఇచ్చారు. అద్దె ఇంటిలో ఉంటున్న మాకు స్థలం ఇవ్వడంతో పక్కా గృహాన్ని నిర్మించుకుంటున్నాం. ఎంతో ఆనందంగా ఉంది.

– చిన్నల చిట్టమ్మ, ముద్దాడపేట, ఆమదాలవలస మండలం

లక్ష్యం పూర్తిచేస్తాం..



జగనన్న కాలనీల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందు కోసం పకడ్బందీ చర్యలు చేపట్టాం. డీఆర్‌డీపీ ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహకారం అందిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికే గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– పైడి కూర్మారావు, ఏపీఎం, డీఆర్‌డీఏ, ఆమదాలవలస మండలం

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



మాట్లాడుతున్న ఎస్‌ఈబీ ఎస్‌ఐ సంధ్యారాణి

నరసన్నపేట: మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితాలు నాశనం అవుతాయని ఎస్‌ఈబీ ఎస్‌ఐ జె.సంధ్యారాణి అన్నారు. శనివారం స్థానిక సాయి రత్న, రాజావేణుగోపాల్ ఐటీఐల్లో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి తీవ్ర హాని కలుగుతుందని, కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఇబ్బందులకు గురవుతారన్నారు. డ్రగ్స్‌తో పట్టుబడితే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. మత్తు పదార్థాల ఆచూకీ లభిస్తే ఎవరైనా 14500కు ఫోన్ చూసి సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు అందుబాటులో ఉండాలి

బూర్జ: సచివాలయ సిబ్బంది స్పందన కార్యక్రమానికి అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీరోజు సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకావాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రభుత్వం అందజేసిన ఏకరూప దుస్తులు విధిగా ధరించాలన్నారు. ప్రభుత్వం ద్వారా అందజేసిన వివిధ రకాల పింఛన్‌లు, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఘనంగా మండప ఆవిష్కరణ మహోత్సవం

ఆమదాలవలస: మండలంలోని రామచంద్రపురం పంచాయతీ ఆనందపురంలో బైరి సత్యనారాయణ, శ్రీనివాసరావు నిర్మించిన అశ్వత్థ నారాయణ మండప ఆవిష్కరణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకకళ్యాణార్థం త్రిమూర్తి స్వరూపమైన వృక్షరాజేశ్వరుడుని, సుబ్రహ్మణ్యారుడినికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

68 మద్యం బాటిళ్ల స్వాధీనం



మద్యం బాటిళ్లను ప్రదర్శిస్తున్న ఎస్‌ఐ గోవిందరావు, సిబ్బంది

పాతపట్నం: పాతపట్నం, కొత్తూరు మండలాల్లో వేర్వేరు చోట్ల 68 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని కుమ్మరి వీధి కూడలి వద్ద 24 ఒడిశా మద్యం బ్యాటిళ్లతో వ్యక్తిని పట్టుకున్నామని ఎస్‌ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపారు. పాతపట్నం కుమర్మివీధికి చెందిన దున్న ధర్మారావు శనివారం పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. దాని విలువ రూ.3,310 ఉంటుందని, బ్యాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

కొత్తూరు: మండలంలోని సిరుసవాడకు చెందిన మల్లా ఫల్గుణరావు, నివగాంకు చెందిన బూరాడ సుందరనారాయణ వేర్వేరుగా 44 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా మండలంలోని ఎన్ఎన్ కాలనీ భవానమ్మ ఆలయం వద్ద శనివారం ఎస్‌ఐ ఎం.గోవిందరావు పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

నవధాన్యాల సాగుతో భూసారం



నవ ధాన్యాలను రైతులకు చూపుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నరసన్నపేట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా భూమిని సారవంతం చేసేందుకు నవ ధాన్యాల సాగు ఎంతో ప్రయోజనమని ప్రకృతి వ్యవసాయం మండల కమిటీ ప్రతినిధి బి.జగన్ అన్నారు. మండలం గుండవల్లిపేటలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 నుంచి 18 రకాల విత్తనాలను వేసవిలో సాగు చేయడం వల్ల భూమికి కావలసిన పద్దెనిమిది రకాల పోషకాలను పుష్కలంగా అందించవచ్చన్నారు. ప్రతీ రైతూ వేసవిలో ఈ నవ ధాన్యాలను సాగు చేయడంతో భూమి సారవంతం అవుతుందన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సేద్యం వైపు మళ్లించడానికి ఇదో మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతు పంచిరెడ్డి సింహాచలం మాట్లాడుతూ నవ ధాన్యాలు సాగు చేస్తున్నాని, దీంతో ప్రయోజనం కనిపించిదన్నారు. పలువురు రైతు సోదరులు పాల్గొన్నారు.

సోమనాథీశ్వరునికి ప్రత్యేక పూజలు

సారవకోట: మండల కేంద్రంలోని సోమనాథీశ్వర ఆలయంలో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు పురస్కరించుకుని పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు సోమేశ్వరరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: మండలంలోని బొడ్డేపల్లిపేట ఫీడర్ పరిధిలో (11కె.వి) ఆదివారం మరమ్మతులు, చెట్టు కొమ్మలు కత్తిరించనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.భయ్యన్నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పట్టణంలోని పాతినవారివీధి, డాబాలవారివీధి, కొత్తకోటవారివీధి సగం, మోనింగివారివీధి, డాబాలవారివీధి, పాలపోలమ్మ ఆలయం ఆవరణం, పోలీస్ స్టేషన్, కోటి కాంప్లెక్స్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

20 నుంచి ఆధార్ అప్‌డేట్ సేవలు

మెళియాపుట్టి: ప్రత్యేక ఆధార్ డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రకుమారి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కార్యదర్శులు, ప్రత్యేక ఆధార్ సెంటర్ల డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్షించారు. 2016 జూన్ 30వ తేదీకి ముందు ఆధార్ కార్డులు పొందినవారందరూ నవీకరించుకోవాలన్నారు. మండలంలో ఈ నెల 20, 21, 27, 28, 29వ తేదీల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు సమాచారం ఇవ్వాలన్నారు. చిరునామా, నివాసధ్రువీకరణ, మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు అంగన్‌వాడీలకు వచ్చేలా చూడాలన్నారు. ఎస్‌డీజీ సర్వేను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీల సహకారం తీసుకోవాలన్నారు. ఏఓ తిరుపతి పట్నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ కాలు అందజేత



జమ్మయ్యకు కృత్రిమ కాలును అందజేసిన సంస్థ అధ్యక్షుడు రమేష్

హిరమండలం: పూనుపేట గ్రామానికి చెందిన గొందరి జమ్మయ్యకు మండలంలోని అంబావిల్లి గ్రామానికి చెందిన అమ్మన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కృత్రిమ కాలును శనివారం సంస్థ అధ్యక్షుడు రమేష్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎవరికైనా కృత్రిమ అవయవాలు కావాలంటే తమను సంప్రదించాలన్నారు. ఇంతవరకు నియోజకవర్గంలో 98 మందికి కృత్రిమ అవయవాలు అందజేసినట్లు తెలిపారు. యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్దానానికి తాగునీరు వరం

- అసెంబ్లీలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: జిల్లాలో ఉద్దానం ప్రాంతాన్ని వణికిస్తున్న కిడ్నీ మహమ్మారి నుంచి కాపాడేందుకు ఒక వైపు కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మాణంతోపాటు మరోవైపు తాగు (రక్షిత) నీటిని అందించేందుకు తగిన నిధులు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి దక్కిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కొనియాడారు. శనివారం అసెంబ్లీ సమావేశంలో ఉద్దానం ప్రాంతంలో తాగునీరు, కిడ్నీ రిసెర్చ్ సెంటర్ 200 పడకల సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణాలపై మాట్లాడారు. ఈ రెండు పథకాలను త్వరంగా ప్రారంభించి ఆ ప్రాంత ప్రజలతోపాటు జిల్లా ప్రజానీకానికి వినియోగంపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిపక్ష నాయకుడిగా జగన్‌మోహన్ రెడ్డి ఉద్దానం ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించి కిడ్నీ బాధిత కుటుంబాల సమస్యలు తెలుసుకున్నారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వారి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని భావించి హిరమండలం వంశధార ప్రాజెక్టు నుంచి రూ.750 కోట్లు ఖర్చుతో ఉద్దానం ప్రాంతంలో ఏడు మండలాల్లోని 8 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే పనులు చేపట్టారని వివరించారు. కిడ్నీ రిసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మానం కోసం రూ.200 కోట్లు మంజూరు చేశారని, పనులు చివర దశలో ఉండటంతో త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని ఆకాంక్షించారు. కిడ్నీ వ్యాధి బారిన పడిన బాధితులకు ప్రతీనెల పింఛన్ చెల్లిస్తున్నామని వివరించారు. ఉద్దానం ప్రాంత ప్రజల తరఫున సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

- పేదల ఆరోగ్యానికి అండగా ఫ్యామిలీ డాక్టర్



పాతపట్నం: సీతారాంపల్లిలో వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు శ్రీధర్



నరసన్నపేట: రావులవలసలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మెండ ప్రవీణ్

నరసన్నపేట: గ్రామాల్లో పేద ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు చేస్తున్నామని, దీనిని ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని మాకివలస వైద్యాధికారి దుష్యంత్, 104 వైద్యులు మెండ ప్రవీణ్ కోరారు. రావులవలసలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 120 మందికి తనిఖీలు చేసి మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ మెండ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ జ్వరాలు వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సీతారాంపల్లిలో..

పాతపట్నం: మండలంలోని సీతారాంపల్లి గ్రామంలో బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, మంచం పట్టిన రోగులు, బీపీ, సుగర్‌తో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత స్థానం



మాట్లాడుతున్న ఎంఈఓ రామారావు

ఆమదాలవలస రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎంఈఓ దువ్వల రామారావు అన్నారు. మండలంలోని వెదుళ్లవలసలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ చిన్నతనంలోనే కష్టపడి చదువుకుంటే జీవితం బాగుంటుందని సూచించారు. గురువులు చెప్పిన పాఠాలు నేర్చుకుని మంచి భవిష్యత్‌ను అందిపుచ్చుకోవాలన్నారు. చిన్నారులు సినీ పాటలకు డాన్స్‌లు చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ చిలకలపల్లి సురేష్, హెచ్‌ఎం దాసరి నారాయణరావు, స్టేట్ బ్యాంక్ మేనేజర్ మూర్తి, కొర్లకోట జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం దేవయాని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల పరిశీలన



చాపర పరీక్ష కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ వినోద్‌బాబు

మెళియాపుట్టి: పరీక్షలు సజావుగా సాగేందుకు పోలీసులు పకడ్బందీగా బందోబస్త్ నిర్వహించాలని పాతపట్నం సీఐ వినోద్‌బాబు సూచించారు. మండలంలోని చాపర ఎస్.కె.కె.జూనియర్ కళాశాల, మెళియాపుట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను శనివారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పరీక్షలు జరగాలన్నారు. ఎస్‌ఐ టి.రాజేష్, పలువురు సిబ్బంది ఉన్నారు.